ఆపన్నహస్తం కోసం..

- హిమోఫీలియాతో అచేతనంగా యువకుడు
- వైద్యం చేయించలేని స్థితిలో తల్లిదండ్రులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



కదల్లేని స్థితిలో ఉన్న వీరవెంకట సునీల్‌కుమార్



సునీల్‌కుమార్‌కు పూర్వ విద్యార్థి సంఘం తరఫున సాయం చేస్తున్న సభ్యులు

తాళ్లపూడి: చిన్నతనంలో తమ కుమారుడి బుడి బుడి నడక చూసి ఆ తల్లిదండ్రులు మురిసిపోయారు.. ఎన్నో ఆశలతో అతన్ని సాకి పెంచుతున్న క్రమంలో సోకిన వ్యాధికి అతను కదల్లేని స్థితికి వెళ్లడంతో తల్లడిల్లిపోతున్నారు.. హిమోఫిలియా అనే వ్యాధితో నిత్యం నరకయాతన అనుభవిస్తున్న తమ కుమారుడిని చూసి ఆ దంపతులు చలించిపోతున్నారు. ఆర్థిక పరిస్థితి బాగోక ఉన్న ఇంటిని అమ్మినా, అప్పులు చేసినా పూర్తి స్థాయిలో వైద్యం అందించలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆపన్నహస్తం కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు.

తాళ్లపూడి మండలం వేగేశ్వరపురం గ్రామానికి చెందిన గుండేపల్లి పోశిబాబు, నాగమణి దంపతులకు అబ్బాయి, అమ్మాయి. కుమారుడు వీర వెంకట సునీల్ కుమార్ (26). పోశిబాబు కూలి పనులు చేస్తుండగా, నాగమణి చిన్న టీ కొట్టు నిర్వహిస్తుంది. తన కుమారుడిని ఉన్నత స్థానంలో నిలపాలని చదివిస్తున్న క్రమంలో పదో తరగతిలోకి వచ్చేసరికి హిమోఫీలియా వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అప్పటి నుంచి సునీల్‌కుమార్ నిత్యం నరకయాతన అనుభవిస్తున్నాడు. కేవలం ఖరీదైన ఇంజెక్షన్లు చేయించడం ఒక్కటే మార్గం అని వైద్యులు చెబుతున్నారని ఆ దంపతులు అంటున్నారు. ఒక్కో ఇంజెక్షన్ రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ ఉంటుంది. ప్రభుత్వ వైద్య కళాశాల హాస్పటల్‌లో ఉచితంగా చేస్తారు. కానీ స్టాక్ ఉండడం లేదని ఇవ్వడం లేదని చెబుతున్నారు. ఏదోలా జీవితం నెట్టుకువస్తున్న ఈ క్రమంలో తల్లిదండ్రులకు భారంగా మారాడు. తన కుమారుడి వైద్యానికి ఇప్పటి వరకూ సుమారు రూ.20 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఉన్న ఇల్లు అమ్మేశారు. ప్రస్తుతం అప్పులు పెరిగిపోయాయి. వైద్య ఖర్చులు భరించడం వారికి పెనుభారంగా మారింది. తమకు చేదోడుగా ఉంటాడనుకున్న కొడుకు కళ్ల ముందే అనారోగ్య సమస్యతో లేవలేని స్థితిలో ఉండడంతో వారు తల్లడిల్లిపోతున్నారు.

వైద్యం.. భారం

హిమోఫిలియా నియంత్రణకు ఫ్యాక్టర్ ఇంజెక్షన్ చేస్తారు. శరీరంలో లోపించిన ఫ్యాక్టర్స్ ఇంజెక్షన్ రూపంలో ఎక్కిస్తారు. దీని ధర సుమారు రూ.4 వేల నుంచి రూ.5 వేలు ఉంటుంది. ఏదైనా రక్తస్రావం అయినప్పుడు దాని తీవ్రతను బట్టి నెలకు 5 నుంచి 10 ఇంజెక్షన్లు అవసరం అవుతాయి. ఒక్కసారి నెలకు రూ.20 వేల నుంచి రూ.60 వేల వరకూ ఖర్చు అవుతుంది. అది తగ్గిన తర్వాత మళ్లీ రాదనడానికి లేదని, మళ్లీ రోజుల్లోనే రావచ్చని సునీల్‌కుమార్ చెబుతున్నారు. దీనివల్ల సునీల్‌కుమార్ కుడి మోకాలు చిప్ప పూర్తిగా పక్కకు జరిగిపోయి నడుస్తూ ఎక్కడ పడిపోతాడో తనకే అర్థం కానీ పరిస్థితి వచ్చింది. దీనికి ఆపరేషన్ పడుతుందని, సుమారు రూ. 4 లక్షలకు పైగా ఖర్చవుతుందని తమిళనాడులోని సీఎంసీ వెల్లూర్ హాస్పిటల్ వైద్యులు చెప్పారని ఆ తల్లిదండ్రులు వివరిస్తున్నారు. ఆపరేషన్‌తో పాటు హిమోఫిలియా సంబంధించిన కొన్ని ఖరీదైన ఆరోగ్య పరీక్షలు చేయాలి. దీనికి వైద్యం ఆరోగ్యశ్రీలో లేదని చెబుతున్నారు.

శరీరం సహకరించక..

వేగేశ్వరపురంలోని కేస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2015–16లో సునీల్ కుమార్ పదో తరగతి చదివాడు. తర్వాత కంప్యూటర్ కోర్సు కూడా నేర్చుకున్నాడు. శరీరం సహకరించక పోవడంతో తాను ఏమీ చేయలేక పోతున్నాడు. కేస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సునీల్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.17 వేలు అందజేశారు. దాతలు విశ్రాంత ప్రొఫెసర్ కైగాల సుబ్బారావు రూ.5 వేలు, శీర్ల సత్యనారాయణ రూ.5 వేలు, వి.నాగలక్ష్మి రూ.5 వేలు, గుత్తికొండ సూర్యనారాయణమూర్తి రూ.వెయ్యి, కారింకి సూర్యనారాయణ మూర్తి రూ.వెయ్యిను పూర్వ విద్యార్థి సంఘం సభ్యులు అడ్డాల డేవిడ్‌రాజు, మారిశెట్టి సత్యనారాయణ తదితరులు అందించారు. సాయం చేసే దాతలు 78932 46024 ఫోన్ నంబరులో సంప్రదించాలని సునీల్ కుమార్ కోరారు.

క్లుప్తంగా

ఘనంగా అమ్మవారి నిమజ్జనం



బ్రాహ్మణగూడెంలో కనకదుర్గమ్మను ఊరేగిస్తున్న భక్తులు

చాగల్లు: శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా చాగల్లు మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారి నిమజ్జనాలు శనివారం ఘనంగా నిర్వహించారు. చాగల్లు వల్లికుంటలోని కనకదుర్గమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. శక్తివేషాలు, డప్పు వాయిద్యాలు, తీన్మార్లతో యువత సందడి చేశారు. ఎస్.ముప్పవరం, బ్రాహ్మణగూడెంలోని రావులచెరువు వద్ద ఉన్న కనకదుర్గమ్మ, కోటవీధిలోని కనకదుర్గమ్మను ప్రత్యేక వాహనాల్లో ఊరేగించి, నిడదవోలు పశ్చిమ డెల్టా కాలువలో నిమజ్జనం చేశారు.

అక్రమ బాణసంచా సీజ్



కోరుమామిడిలో బాణసంచాను పరిశీలిస్తున్న ఎస్సై బాలాజీ సుందరరావు

నిడదవోలు రూరల్: కోరుమామిడిలోని ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన బాణసంచాను సీజ్ చేసినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు శనివారం తెలిపారు. కోరుమామిడికి చెందిన మణికుమార్ ఇంట్లో సుమారు 4 వేలు విలువ చేసే బాణసంచాను గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్ల మధ్య బాణసంచా నిల్వ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, విక్రయాలకు సంబంధించి ఆయా శాఖల అనుమతులు తప్పనిసరిగా ఉండాలని ఆయన సూచించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

నిడదవోలు: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టిన ఘటనపై పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు జువ్వల రాంబాబు మాట్లాడుతూ, ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గండి శ్రీనివాసరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నిడదవోలు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శనివారం రోగులు, వారి సహాయకులకు రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు శివ రామ హరిప్రసాద్, వైద్యులు చిక్కాల ప్రకాశరావు, చిక్కాల రాజా, కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, గాజుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0తో ప్రజలకు ప్రయోజనం



గ్రామ సంఘాల మహిళలతో మాట్లాడుతున్న ఏపీఎం శ్యాంసుందర్

నల్లజర్ల: సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ ప్రజలకు ఎంతో ఉపయోగకరమని ఐకేపీ ఏపీఎం శ్యాంసుందర్ అన్నారు. ప్రకాశరావుపాలెం రైతుసేవా కేంద్రంలో శనివారం గ్రామ సంఘ మహిళలకు జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ ప్రయోజనాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.జాన్‌విక్టర్, వీఆర్వో లక్ష్మణమూర్తి, వెల్ఫేర్ అసిస్టెంట్ సత్యనారాయణ, సీఏలు కనకవయ్యారి, పద్మావతి, కనకాచార్యులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి మాజీ హోంమంత్రి అభినందనలు



క్రీడాకారిణి కోనాల లిన్సీని అభినందిస్తున్న తానేటి వనిత

దేవరపల్లి: కర్ణాటకలోని కొప్పల్ ఇండోర్ స్టేడియంలో సెప్టెంబరు 26, 27, 28 తేదీల్లో జరిగిన 13వ జాతీయ పెన్ కాక్ సిలాట్ ఛాంపియన్ షిప్ 2025 పోటీల్లో దేవరపల్లికి చెందిన చిన్నారి కోనాల లిన్సీ బంగారు పతకం సాధించింది. లిన్సీని రాష్ట్ర మాజీ హోంమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత శనివారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సిద్ధించి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆమె సూచించారు. లిన్సీని ప్రోత్సహించిన గురువులు కృష్ణంరాజు, బౌద్ధ ధర్మ యుద్ధ కళాక్షేత్రం మాస్టర్ వెంకట్, ఓలిశెట్టి వంశీకృష్ణకు కటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలను వేధించడమే లక్ష్యం



సమావేశంలో కూటమి అన్యాయాలపై మాట్లాడుతున్న కూచిపూడి సతీష్, పార్టీ నాయకులు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులను వేధించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ దేవరపల్లి మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రశ్నిస్తే కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆయన ఆరోపించారు. దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో శనివారం రాత్రి మాజీ సర్పంచ్ దోనెల్లి జానకీరామ్ అధ్యక్షతన జరిగిన బాబూ ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనించి తగిన గుణపాఠం చెప్పడానికి ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పడకేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లడానికి పార్టీ అధ్యక్షులు వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాలను గ్రామ గ్రామాన నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. 2029లో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకువచ్చి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని ఆయన గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి సత్తి సాయి ఈశ్వరరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కుసులూరి వెంకటసతీష్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి, పాపోలు రెడ్డిబాబు, నిమ్మగడ్డ కృష్ణారావు, పోలుమాటి గోపి, పాకా కాంతారావు, పోలుమాటి రాము, బొల్లం సతీష్, కాటం రాము, పలువురు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో ఐదు లక్షల పింఛన్ల కోత



ప్రక్కిలంకలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన ఖండవల్లి రామచంద్రాన్ని ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రావు

- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- పక్కిలంకలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం

తాళ్లపూడి: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 67 లక్షల పింఛన్లు ఉండగా, ఇప్పుడు చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటిని 62 లక్షలకు కుదించారని, సుమారు 5 లక్షల పింఛన్లకు కోత విధించారని నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి యాళ్ల బాబూరావు ఆధ్వర్యంలో శనివారం ప్రక్కిలంకలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి వెంకట్రావు, మండల నాయకులు కలసి గ్రామంలో రచ్చబండ నిర్వహించి.. చంద్రబాబు 15 నెలల పాలనలోని మోసాలను ప్రజలకు వివరించారు. మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో నేరుగా సొమ్ములు జమ చేసి విద్యార్థులను పాఠశాలలకు పంపేలా చర్యలు తీసుకున్నారన్నారు. చంద్రబాబు మాత్రం తల్లికి వందనం పథకంలో నిబంధనలు పెట్టి కోత విధించారన్నారు. నిరుద్యోగ భృతి మాటే ఎత్తడం లేదన్నారు. హామీలు ఇచ్చి.. అమలు చేయక పోవడం ఆయన నైజమని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, గ్రామ సర్పంచ్ యాళ్ల స్వప్న, వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి యాళ్ల బాబూరావు, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి గూడా విజయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిట్టా శ్రీనివాస్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వంబోలు పోశిబాబు, నియోజక వర్గ లీగల్ సెల్ కన్వీనర్ కవల నాగేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్, సర్పంచ్‌లు గండి రాంబాబు, తిగిరిపల్లి వెంకట్రావు, నాయకులు కొసన శివ, మండిగ గిరి, కొల్లి దుర్గారావు, కడవుల రజనీ కుమార్, కొయ్యే దుర్గారావు, పెండెం పోశిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

ప్రక్కిలంక గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు ఖండవల్లి వెంకటలక్ష్మి భర్త ఖండవల్లి రామచంద్రం.. టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

గృహ ప్రవేశానికి హాజరు

చాగల్లు: బ్రాహ్మణగూడెం సర్పంచ్ గురువెల్లి కుమారి గృహ ప్రవేశ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శనివారం హాజరయ్యారు. సర్పంచ్ కుమారి, భర్త కోట సత్యనారాయణకు అభినందనలు తెలిపి సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ ఉపాధ్యక్షులు ఆత్కూరి దొరయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, నాయకులు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, ఉండవల్లి శ్రీను, సర్పంచ్‌లు ముప్పిడి మహాలక్ష్మడు, కుదపా రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, పొన్నాడ సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని ఆందోళన



త్యాజంపూడి-యర్నగూడెం రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆందోళన చేస్తున్న ప్రజలు

దేవరపల్లి: దాదాపు దశాబ్దకాలంగా అభివృద్ధికి నోచుకోని త్యాజంపూడి- యర్నగూడెం ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానికులు శనివారం ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ రోడ్డు సమస్య పరిష్కారం కోరుతూ ఈ నెల 23వ తేదీన గ్రామంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామస్తులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అక్టోబరు 4వ తేదీన రోడ్డు రోకో చేయాలని సమావేశంలో నిర్ణయించిన మేరకు శనివారం రోడ్డు రోకోకు సన్నద్ధం కాగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు రోడ్డు సమస్యను రెండు నెలల్లో పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో నిరసనను తాత్కాలికంగా విరమించారు. పది సంవత్సరాలుగా రోడ్డు దుస్థితి దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారినా రోడ్డు దుస్థితి మారలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు రోడ్డు పునర్ నిర్మాణానికి తక్షణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కుసులూరి వెంకట సతీష్, మాజీ సర్పంచ్ పల్లి రత్నారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతుల కృష్ణారెడ్డి, డీవైఎఫ్ఐ గ్రామ కమిటీ అధ్యక్షుడు గట్టిం నాని, సీఐటీయూ మండల నాయకులు అయినపర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ల అడ్డగింపు



రాఘవపురంలో టిప్పర్‌ను అడ్డుకున్న స్థానికులు

కోరుకొండ: సీతానగరం మండలం నల్లగొండ, కోరుకొండ మండలం రాఘవపురంలోని కొండలను తవ్వేసి టిప్పర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నారు. అతి వేగంగా రాకపోకలు సాగిస్తుండటంతో సమీపంలోని గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం రాత్రి టిప్పర్లను వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాఘవపురం వాసులు అడ్డుకున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో కొనసాగుతున్న అక్రమ రవాణాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లారీల రాకపోకల కారణంగా దుమ్ముతో వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



దేవరపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

దేవరపల్లి: సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయులు దేవరపల్లిలో శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మండల ఉపాధ్యాయ సంఘాల (ఫ్యాప్టో) సమాఖ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక శ్రీచైతన్య స్కూలు నుంచి పోలీస్ స్టేషన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఫ్యాప్టో నాయకులు ఎల్‌వీవీ రామారావు, ఓరుగుంటి శివ రాజు, పులపాకల గంగరాజు, కాటం బాబు మాట్లాడుతూ పాత డీఏ, పీఆర్‌సీ, సరెండర్ లీవు బకాయిలు వెంకటనే చెల్లించాలన్నారు. పీఆర్‌సీ చైర్మన్‌ను వెంటనే నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏ బకాయిలను చెల్లించాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.మోహన్, పాపోలు రామారావు, జి.కిరణ్ కుమార్, కె.భూషణం, డి. శ్రీనివాసరెడ్డి, ఎ.సతీష్, కె.శ్రీనివాస్, కె.సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బ్రెజిల్ ప్రతినిధుల పర్యటన



కొవ్వూరులో పర్యటించిన బ్రెజిల్ ప్రతినిధులు

కొవ్వూరు: ప్రకృతి వ్యవసాయం, వినూత్న పద్ధతులు, రైతు సాధికారతపై ప్రత్యక్ష అనుభవాల కోసం బ్రెజిల్, యూఏఈ, శ్రీలంకకు చెందిన 30 మంది ప్రతిష్ఠాత్మక నిపుణుల బృందం రాష్ట్రంలో సందర్శించారు. ఈ పర్యటనను రైతు సాధికార సంస్థ, భాగస్వాములు, నొ పేరెంట్స్ బృందం సంయుక్తంగా నిర్వహించారు. నొ సంస్థ స్థిరమైన, పునరుత్పత్తి వ్యవస్థలను సాధించడానికి కంపెనీలకు మద్దతుగా పనిచేసే వ్యాపారవేత్తల, నిపుణుల గ్లోబల్ అలయన్స్ ఈ సంస్థను జర్మనీకి చెందిన అంతర్జాతీయ వ్యాపారవేత్త వాల్టర్ లింక్ స్థాపించగా.. ఆయన ప్రస్తుతం స్థాపక సీఈవోగా కొనసాగుతున్నారు. ఆయన స్వయంగా ఈ ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పర్యటనల్లో పాల్గొన్నారు. ఆయనతో పాటు ప్రధాన బృంద సభ్యులు, బ్రెజిల్ మంత్రిత్వ శాఖకు చెందిన వివియన్, సాండ్రో కూడా పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా ప్రతినిధుల బృందాన్ని రెండు గ్రూపులుగా విభజించారు. ఈ బృందాలు కొవ్వూరు మండలంలోని కాపవరం గ్రామాలను సందర్శించి, రైతు సాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రజా భాగస్వామ్య ప్రకతి వ్యవసాయం వినూత్న నమూనాలు, సామూహిక ఆధారిత విధానాలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుధాకర్, జాకీర్, స్వాతి, హుమయున్, మధుమోహన్ (అగ్రికల్చర్ ఆఫీసర్), జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు, జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, ఉప వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి గంగాధర్‌రావు ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర ప్రకటించాలి



యర్నగూడెంలో మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లభనేని సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి రాజేంద్రబాబు

దేవరపల్లి: ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమైనందున రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు సకాలంలో ప్రారంభించాలని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వల్లభనేని సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేవరపల్లి మండలం యర్నగూడెంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ వరి కోతలు ప్రారంభించినందున ధాన్యం అమ్ముకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకొనేందుకు కళ్లాల సదుపాయం లేక రోడ్లపై రాశులుగా పోసి దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోతున్నారని మండిపడ్డారు. రైతు సేవా కేంద్రాల్లో కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలని ఆయన ప్రభుత్వానికి విజప్తి చేశారు. బస్తా ధాన్యం రూ.1,810 మద్దతు ధర ఉండగా, మిల్లర్లు రూ.1,250 కొనుగోలు చేసి రైతులను దోపిడి చేస్తున్నారన్నారు. రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి రాజేంద్రబాబు మాట్లాడుతూ 50 శాతం ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయగా, మిగిలిన 50 శాతం దళారులకు అమ్ముకోవలసి వచ్చిందన్నారు. మిల్లర్లు రైతులను అనేక ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. రైతు విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి గడా రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను మార్కెట్‌కు తీసుకువెళ్తే కనీసం మద్దతు ధర రావడంలేదన్నారు. రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సత్తి జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా తెరవడం వల్ల రైతులు దళారుల బారినపడి నష్టపోతున్నారన్నారు. మెట్ట ప్రాంతంలో కళ్లాలు లేక కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టడం వల్ల వర్షాలకు తడిచి నాణ్యత దెబ్బతింటుందని కోసిన ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సత్తి సాయి ఈశ్వరరెడ్డి, పలువురు రైతులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.